ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్ అందజేసిన ఎస్పీ

కానిస్టేబుల్ కిరణ్ కుటుంబానికి చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం, మార్చి 14: అనారోగ్య కారణాలతో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ రోహిత్‌రాజు గురువారం తన కార్యాలయంలో చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఆర్మ్డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ నిరుడు అనారోగ్యంతో మృతిచెందినట్లు తెలిపారు. కాగా, అతడి కుటుంబానికి భద్రతా ఎక్స్‌గ్రేషియా నుంచి రూ.8 లక్షలు, కార్పస్ ఫండ్ నుంచి రూ.50 వేలు, విడో ఫండ్ నుంచి రూ.10 వేలు కలిపి మొత్తం రూ.8.60 లక్షల మంజూరైనట్లు వివరించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్‌ను అతడి కుటుంబానికి అందజేశామని అన్నారు. జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పోలీస్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ మధు పాల్గొన్నారు.

ముగ్గురికి కారుణ్య ఉద్యోగాలు

ఇల్లెందు రూరల్, మార్చి 14: మెడికల్ అన్‌ఫిట్ అయిన ముగ్గురు సింగరేణి కార్మికులకు బదులుగా వారి వారసులకు కారుణ్య ఉద్యోగాలు ఇస్తూ ఏరియా జీఎం జాన్ ఆనంద్ గురువారం తన కార్యాలయంలో ఉత్తర్వు కాపీలు అందజేశారు. ఎస్‌వోటు జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, రక్షణాధికారి ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

చుంచుపల్లి, మార్చి 14: వేరుశనగ పంటలో రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీ.లక్ష్మీనారాయణమ్మ సూచించారు. కేవీకే ఆధ్వర్యంలో మండలంలోని చుంచుపల్లి తండాలో గురువారం నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం వేరుశనగలో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి శాస్త్రవేత్త డాక్టర్ రాయల శ్రీనివాస్ వివరించారు. ఎంఏవో రాజేశ్వరి, శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్, డాక్టర్ శివ, ఏఈవో మమత పాల్గొన్నారు.

'స్టేట్‌మెంట్ తెస్తేనే బిల్లులు చేస్తామనడం సరికాదు'

రామవరం, మార్చి 14: సింగరేణిలో పనిచేస్తున్న కన్వేయన్స్ వెహికిల్స్ విషయంలో బ్యాంకు మేనేజర్ సంతకంతో కూడిన స్టేట్‌మెంట్ తెస్తేనే బిల్లులు చేస్తామనడం సరికాదని కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం డ్రైవర్ల విభాగం ఇన్‌చార్జి బాసబోయిన రవికుమార్ అన్నారు. అంతకుముందు మాదిరిగానే ఫోన్ పే, యోనో యాప్, ఏటీఎం స్లిప్పులపై డ్రైవర్ల సంతకాలు తీసుకొని బిల్లులు చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం జీకేవోసీ యాక్టింగ్ మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

లక్కీ డ్రా ద్వారా విద్యార్థుల ఎంపిక

భద్రాచలం, మార్చి 14: హైదరాబాద్‌లోని రామంతపూర్, బేగంపేట్ పబ్లిక్ స్కూల్స్‌లో 1వ తరగతి (ఇంగ్లిష్ మీడియం)లో వచ్చే విద్యాసంవత్సరంలో సీట్ల భర్తీకి గురువారం భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో లక్కీ డ్రా జరిగింది. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఓ బాలుడితో లక్కీడ్రా తీయించారు. మొత్తం ఆరుగురు ఎస్టీ విద్యార్థులు ఆయా స్కూళ్లలో అడ్మిషన్ సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో సమ్మయ్య పాల్గొన్నారు.

ఇల్లెందులో కిడ్నీ డే

మూత్రపిండాల ప్రాధాన్యాన్ని తెలిపేందుకు ప్రతి ఏటా మార్చి రెండవ గురువారం వరల్డ్ కిడ్నీ డే జరుగుతున్నది. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు ఏర్పాటు చేసిన కిడ్నీ డే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఆస్పత్రిలోని కిడ్నీ రోగులను పరామర్శించారు. మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైద్యులు బన్సీ, లెనిన్, సిబ్బంది పాల్గొన్నారు.

'భవిత పాఠశాలలకు సదుపాయాలు కల్పించాలి'

కొత్తగూడెం అర్బన్, మార్చి 14: జిల్లాలోని భవిత పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని టీపీపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీశ్ కోరారు. ఈ మేరకు ఇందిరానగర్ భవిత పాఠశాలకు గురువారం ఆయన ఆట వస్తువులను వితరణ చేసి వాటిని హెచ్‌ఎం మేకల జ్యోతిరాణి, ఉపాధ్యాయులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు చేసే సేవ దైవ సేవతో సమానమని అన్నారు. వీజేఏసీ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య రావొద్దు

ఇల్లెందు, మార్చి 14: పట్టణంలో ఎక్కడా కూడా మంచి నీటి సమస్య కుండా చూడాలని అధికారులను మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజూ మంచి నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. పట్టణంలో ఎక్కడైనా మంచి నీటి సమస్య ఉంటే 95059 87252 నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. డీఈ నవీన్, మేనేజర్ అంకుషావలి, ఏఈ కుమారస్వామి, కౌన్సిలర్లులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు

టేకులపల్లి, మార్చి 14: ఎప్పుడూ సాగు చేస్తున్నవే కాకుండా, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగే మెరుగ్గా ఉంటుందని, అందుకే రైతులు వీటి వైపు మొగ్గు చూపాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలను గురువారం పరిశీలించారు. కొత్త పోడు పట్టాలు వచ్చిన రైతులు కేవైసీ చేయించుకోవాలన్నారు. బీరకాయ, పామాయిల్ పంటలను పరిశీలించి, సాగుదారులను అభినందించారు. ఏడీఏ వాసవీరాణి, ఏవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
CHANGE OF NAME
★I BOCHU PRASANNA alias DOBBALA PRASANNA, W/o. Satish Kumar, D/o. Basavaiah, R/o. 15-113 Subhash Nagar, Sudimala, SBI Lane, Yellandu, Bhadradri Kothagudem, Telangana-507 123, have Changed My Name to NUTHALAPATI PRASANNA.
NT-328309
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాజీ సర్పంచ్‌కు పరామర్శ

బూర్గంపహాడ్, మార్చి 14: అంజనాపురం మాజీ సర్పంచ్ తేజావత్ సూర్యం కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం గ్రామానికి వచ్చి సూర్యాన్ని పరామర్శించారు. రేగా వెంట జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, నాయకులు ఖగేందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, నరేందర్, శ్రీనివాసరెడ్డి, బాలిరెడ్డి, పెద్దవీర్రాజు, హుస్సేన్‌నాయక్ ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

భూగర్భ గనుల్లో ఆధునిక సాంకేతికత వినియోగం

సింగరేణి ఉన్నతాధికారులకు వివరించిన ఆస్ట్రేలియా బృందం

సీఎండీకి వివరిస్తున్న ఆస్ట్రేలియా కంపెనీ ప్రతినిధులు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 14: భూగర్భ గనులను నూరుశాతం ప్రమాదరహితంగా రూపొందించడం కోసం సింగరేణి యాజమాన్యం అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతను పరిశీలిస్తోందని సంస్థ సీఎండీ బలరాం పేర్కొన్నారు. ఇందుకోంస మేలైన సాంకేతికతను వినియోగించడానికి సింగరేణి సిద్ధంగా ఉందని చెప్పారు. భూగర్భగనుల్లో పైకప్పు కూలి జరిగే ప్రమాదాలను నివారించడం కోసం ఆస్ట్రేలియాకు చెందిన నోమ్ అనే సంస్థ కొత్తగా రూపొందించిన ఆధునిక పరికరాల పనితీరును గురువారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో పరిశీలించిన తర్వాత ఉన్నతస్థాయి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. భూగర్భ గనుల్లో రక్షణ చర్యలు ఎన్నో తీసుకున్నప్పటికీ అకస్మాత్తుగా పైకప్పు కూలి కార్మికులు మృతిచెందిన ఘటనలు అనేకం జరిగాయని అన్నారు. కాగా, ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ పరిశోధన సంస్థ నోమ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పైకప్పు ప్రమాదాలు జరగకముందే ముందస్తు హెచ్చరికలు జారీ చేసే ఒక యంత్ర విభాగాన్ని రూపొందించినట్లు చెప్పారు. దీనివల్ల పైకప్పు ప్రమాదం జరగకముందే గనిలోని కార్మికులను అధికారులు హెచ్చరిస్తూ ఫ్లాష్ లైటింగ్ ద్వారా గానీ, సైరన్ ద్వారా గానీ ఇది అప్రమత్తం చేస్తుందన్నారు. దీనివల్ల ప్రమాదాన్ని నివారించడం కోసం అన్ని రకాల చర్యలు తీసుకొని ప్రాణ నష్టం జరుగకుండా చూసే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. అయితే, ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణి సంస్థలో కూడా వినియోగించాలని కోరుతూ ఆస్ట్రేలియా సంస్థ సీఎండీ నాథన్ ఓవెన్, జనరల్ మేనేజర్ కేసన్ ఫిన్‌లెన్‌లు సింగరేణి సీఎండీ బలరాం, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం ఎస్డీఎం సుభానీలను కోరారు.

పెద్దమ్మగుడి హుండీ ఆదాయం రూ.25.44 లక్షలు

పెద్దమ్మగుడిలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ బాధ్యులు

పాల్వంచ రూరల్, మార్చి 14: పెద్దమ్మగుడి హుండీ ఆదాయం రూ.25.44 లక్షలుగా నమోదైంది. దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు భేలోసింగ్, ఆలయ ఈవో రజనీకుమారి ఆధ్వర్యంలో పెద్దమ్మగుడి ఆలయ కళాక్షేత్రంలో గురువారం హుండీని లెక్కించారు. గత డిసెంబర్ 20 నుంచి ఈ నెల మార్చి 13 వరకు 85 రోజులకు గాను భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.25,44,968 ఆదాయం వచ్చినట్లు తేలింది. వీటితోపాటు ఆరు విదేశీ కరెన్సీ నోట్లు, మిశ్రమ బంగారం కూడా హుండీలో ఉన్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు మహిపతి రామలింగం, ధర్మకర్తలు పాల్గొన్నారు. కొత్తగూడెం ప్రగతినగర్‌కు చెందిన అమ్మవారి భక్తులు జగదీశ్వర్, ప్రత్యూష దంపతులు ఆలయ పునఃనిర్మాణ పనుల కోసం రూ.9,116ను విరాళంగా అందించారు.

18 రోజుల ముందుగానే లక్ష్య సాధన

105 శాతం వృద్ధితో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాం: జీఎం

రామవరం, మార్చి 14: సింగరేణి కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన 129.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని ఇక్కడి అధికారులు 18 రోజులు ముందుగానే సాధించారు. గురువారం నాటికి 129.74 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన 128.01 లక్షల టన్నులను మార్చి 31న పూర్తి చేయాల్సి ఉందని, కానీ దానిని అధిగమిస్తూ ఈ ఆర్థిక సంవత్సరం ముగింపునకు 18 రోజుల ముందుగానే 105 శాతం వృద్ధితో ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం కొత్తగూడెం ఏరియా జీఎం శాలెంరాజు వెల్లడించారు. ఈ మేరకు ఏరియాలోని తన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. తమ ఏరియాకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించామని అన్నారు. సంస్థ సీఎండీ బలరాం దిశా నిర్దేశాలతో, డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్‌రెడ్డి సలహాలు సూచనలతో లక్ష్యాలను సాధించామని అన్నారు. ఈ లక్ష్య సాధనలో భాగస్తులైన ఉద్యోగులు, అధికారులు, యూనియన్ ప్రతినిధులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామని అన్నారు.

'గంజాయి నిర్మూలనకు అందరి సహకారం అవసరం'

మాట్లాడుతున్న సీఐ వినయ్‌కుమార్

పాల్వంచ, మార్చి 14: గంజాయి నిర్మూలను ప్రతి ఒక్కరి సహకరామూ అవసరమని పాల్వంచ సీఐ వినయ్ కుమార్ అన్నారు. ఇందుకోసం కోసం అందరూ సహకరించాలని కోరారు. పాల్వంచలో గంజాయి పట్టుపట్టడం, అందులో ఏడుగురు యువకులు ఉండడం, వారిలో నలుగురు పాల్వంచ వారే ఉండడంతో గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. గంజాయి రవాణాను అరికట్టడానికి తమ శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందని, ప్రత్యేక నిఘా బృందాలతో పనిచేస్తోందని అన్నారు. ఇందువల్లనే గంజాయిని పట్టుకోగలిగామని, నిందితులను రిమాండ్ చేయగలిగామని అన్నారు. పాల్వంచ టౌన్ ఏఎస్సై రాఘవయ్య, రూరల్ ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల చట్టాలను మళ్లీ తెస్తున్న కేంద్ర ప్రభుత్వం

మెదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎన్డీ నాయకులు

కొత్తగూడెం అర్బన్, మార్చి 14: అన్నదాతల సుదీర్ఘ ఉద్యమంతో నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటున్నామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం.. ఇప్పుడు వాటిని మళ్లీ తెరమీదకు తెస్తోందని సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అవునూరి మధు ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగానే మళ్లీ రైతు ఉద్యమాలు దేశవ్యాప్తంగా తీవ్రతరమవుతున్నాయని అన్నారు. నల్ల చట్టాలను, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఆందోళన చేస్తున్న ఎస్‌కేఎం.. రైతులందరూ దేశవ్యాప్తంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఎన్‌డీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెంలో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. ఎన్‌డీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

చుంచుపల్లి, మార్చి 14: 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సోషల్ ఆడిట్ జరిగింది. ఇప్పటికే మండలంలోని 18 పంచాయతీల్లోనూ గడిచిన వారం రోజులుగా సామాజిక తనిఖీ బృందాల బాధ్యులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి గ్రామసభలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సోషల్ ఆడిట్‌లో గ్రామ పంచాయతీల వారీగా జరిగిన పనులను ఆడిట్ సభ్యులు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది వివరణలు ఇచ్చారు. వీటిని ప్రిసైడింగ్ అధికారి, అదనపు డీఆర్‌డీవో రవి నమోదు చేసుకున్నారు. ఎంపీపీ బదావత్ శాంతి అధ్యక్షతన జరిగిన ఆడిట్‌లో అధికారులు ప్రకాశ్, అనూష, రమణారావు, అనీల్, నర్సయ్య, అశోక్‌కుమార్, గుంటి సత్యనారాయణ, రఘుపతి, పిల్లి నాగరాజు, అనీల్, స్వాతి, కోటేశ్, యశ్వత్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కల్యాణలక్ష్మి చెక్కులు

టేకులపల్లి, మార్చి 14: మండలంలోని తొమ్మిదోమైలు తండా, దాస్ తండా పంచాయతీల్లోని కల్యాణలక్ష్మి లబ్ధిదారులు 84 మందికి చెక్కులను వారి ఇళ్ల వద్ద అధికారులు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీవో రవీంద్రరావు, ఎంపీటీసీ మెంబర్ బానోత్ పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చాలని వినతి

తమ దాహార్తి తీర్చాలని కోరుతూ దాస్‌తండా పంచాయతీ సింగ్యాతండా గ్రామస్తులు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు విజ్ఞప్తి చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చేందుకు వచ్చిన ఆయనకు తాగునీటి ఎద్దడి సమస్యను వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అశ్వాపురం, మార్చి 14: మండలంలో నిర్మించతలపెట్టిన పలు బీటీ రహదారులకు గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు.అశ్వాపురం రైతువేదికలో తహసీల్దార్ స్వర్ణలత అధ్యక్షతన 30 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

ఇల్లెందు రూరల్: మాట్లాడుతున్న జాన్ ఆనంద్

ఇల్లెందు రూరల్, మార్చి 14: ఇల్లెందు జేకే కాలనీలోని సింగరేణి హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం గురువారం జరిగింది. ముఖ్య అతిథి సింగరేణి జీఎం జాన్ ఆనంద్ మాట్లాడుతూ.. పరీక్ష సమయానికి 20 నిమిషాల ముందే కేంద్రంలో ఉండాలన్నారు. పరీక్ష గదిలో ఉన్నప్పుడు అన్ని రకాల మానసిక ఒత్తిళ్లు-ఆందోళనలకు దూరంగా ప్రశాంతంగా ఉండాలని అన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇచ్చారు. కరస్పాండెంట్, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్‌రావు, ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాములోరికి నిత్యకల్యాణం

భద్రాచలం, మార్చి14: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య బలిహరణం, నిత్య హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి సంప్రదాయబద్ధంగా నిత్య కల్యాణం చేశారు.

ప్రతి మంగళ , బుధ, గురువారాల్లో స్థానికులకు రామయ్య దర్శనం

భద్రాచలం, మార్చి 14: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతి మంగళ, బుధ, గురువారాల్లో (ఉత్సవాలు, ప్రముఖులు విచ్చేసిన రోజులు, విశేష రోజుల్లో మినహా) సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు స్థానికతను తెలిపే ధ్రువపత్రాలు చూపించి స్థానికులు స్వామివారిని దర్శించుకోవచ్చని గురువారం ఆలయ ఈవో తెలిపారు. రూ.100 క్యూలైన్ల ద్వారా ఉచితంగా స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తామని ప్రకటించారు. భద్రాద్రి వాసులకు మాత్రమే ఈ సదుపాయం వర్తిస్తుందన్నారు.

25న స్వర్ణలక్ష్మి పూజా మహోత్సవం

ఆలయ పరిధిలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్వర్ణలక్ష్మి పూజా మహోత్సవం నిర్వహిస్తున్నామని, పూజల్లో పాల్గొనేందుకు ఒక్కో భక్తుడు రూ.600 చెల్లించాల్సి ఉంటుందని ఆలయ ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. రుసుము చెల్లించిన వారికి ఆలయ తరపున అమ్మవారి వెండి ప్రతిమ, జాకెట్ పీస్‌తోపాటు ప్రసాదం అందిస్తామన్నారు. అలాగే ఇదే రోజు హోలీ సందర్భంగా రామయ్యను పెండ్లి కుమారుడిగా అలకరిస్తామని వెల్లడించారు. వేడుక సందర్భంగా నిత్య కల్యాణాన్ని నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వేణుగోపాలుని ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం

ఆలయ సన్నిధిలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జడ్పీటీసీ, నాయకులు

పర్ణశాల, మార్చి 14: చిన్నబండ్రేవు సంతానవేణుగోపాలస్వామి ఆలయ సన్నిధిలో గురువారం భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రతిష్ఠ, నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠా మహోత్సవం జరిగింది. వేడుకలకు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరై యాగశాలను ప్రారంభించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సారపాక, మార్చి 14: సారపాక గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయ సన్నిధిలో వచ్చే నెల 8 నుంచి 10వ తేదీ వరకు జాతర జరుగనున్నది. జాతర పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు శివసాయికుమార్ శర్మ, సిలివేరు శ్రీనివాసరావు, సిలివేరు వీరాంజనేయులు, రాంజీ జగన్నాథరావు, ముప్వా వెంకటేశ్వరరావు, పేరాల శ్రీను, వంశీ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

మణుగూరుటౌన్, మార్చి14: మణుగూరు ఏరియా పీవీకాలనీని పద్మావతి అండాళ్ సమేత వేంకటేశ్వస్వామి ఆలయ సన్నిధిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు హాజరరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు.

మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కొత్తగూడెంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు ప్రాతిపదిన 119 పోస్టుల భర్తీ కోసం శుక్రవారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ఎల్ లక్ష్మణ్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీవోసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్వ్యూలు ఉంటాయని, అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుండాల, మార్చి 14: రేలా రేలా స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు గురువారం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 4, 5వ తరగతులు చదువుతున్న విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వారికి సీబీఎస్ స్టడీ మెటీరియల్ అందజేశారు. సేవా సమితి సభ్యులు కొమరం సాంజిత, స్వరూప పాల్గొన్నారు.

ఉపాధి పనుల పూర్తి వివరాలు వెల్లడించాలి

పాల్వంచ రూరల్, మార్చి 14: సామాజిక తనిఖీకి వచ్చే సిబ్బంది.. ఉపాధి హామీ కూలీలు, పనుల పూర్తి వివరాలు వెల్లడించాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొత్తసూరారం పంచాయతీలో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రంగాపురం గ్రామసభకు తహసీల్దార్ వివేక్ హాజరయ్యారు. అనంతరం నాగారం, నాగారంకాలనీ, సూరారం పంచాయతీల్లోని నర్సరీలను ఎంపీడీవో పరిశీలించారు.

వలస కూలీలకు దుస్తుల పంపిణీ

బూర్గంపహాడ్, మార్చి 14: కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలోని బట్టిగూడెం, ఊర్లదోసపాడు, నకిరిపేట పంచాయతీ ఎదుళ్లచెరువులో నివాసం ఉంటున్న 100 ఆదివాసీ వలస కుటుంబాలకు గురువారం గూంజ్ సేవా స్వచ్ఛంద సంస్థ సభ్యులు దస్తులు అందజేశారు. కామిరెడ్డి నాగిరెడ్డి, నల్లమోతు సురేశ్, హరిబాబు పాల్గొన్నారు.

రైతులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలి

ఇల్లెందు రూరల్, మార్చి 14: రైతులంతా తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబురావు అన్నారు. మండలంలోని రొంపేడు, సుదిమళ్ల, చల్లసముద్రం సీఎస్‌సీ సెంటర్లను గురువారం సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడుతూ.. పీఎం కిసాన్ ద్వారా సంవత్సరానికి విడతలవారీగా రైతులకు రూ.6 వేలు అందుతాయన్నారు. దీనిని అందుకోవాలంటే ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. వరి పొలాలను పరిశీలించారు. ఏడీఏ పి.వాసవీరాణి, ఏవో పి.సతీష్, ఏఈవోలు పాల్గొన్నారు.

రేపు మెగా లోక్‌అదాలత్

మణుగూరు టౌన్, మార్చి14: మణుగూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పంతాలు, పట్టింపులను పక్కన పెట్టి రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

విమోచన ఉజ్జీవ సభలు ప్రారంభం

భద్రాచలం, మార్చి14: పట్టణంలోని ఏఎస్సార్ కాలనీ విమోచన ప్రేయర్ మ